క్లుప్తంగా

హరిదాసుకు సత్కారం



రంపయర్రంపాలెంలో హరిదాసును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

గోకవరం: రంపయర్రంపాలెంలో హరిదాసును బుధవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు గ్రామంలో నగర సంకీర్తన చేసిన ఖమ్మం జిల్లా సత్తుపల్లి గ్రామానికి చెందిన సాతాన వైష్ణవ కుటుంబానికి చెందిన హరిదాసు బెజవాడ పవన్‌కుమార్‌ను గ్రామ ప్రజలు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి నగదు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్తు రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ హరినామ సంకీర్తనతో నెలరోజుల పాటు గ్రామ ప్రజలకు వీనుల విందు చేసిన యువ హరిదాసు పవన్‌కుమార్‌ను గ్రామస్తులు సత్కరించడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాటి రాంబాబు, పాటిరాజా, దాకారపు ధర్మరాజు, సత్యం శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా సత్సంగ ప్రముఖ్ కొరవటి సత్యనారాయణ, దేవలంక పెద్ద కాపు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పూజలు

గండేపల్లి: మురారి మామిడి తోటల్లో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం భక్తులు దర్శించుకున్నారు. కనుమ పండగను పురస్కరించుకుని కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. నీలాద్రిరావుపేటకు చెందిన యేలేటి ప్రసాద్ స్థానిక చక్రవర్తి నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా, అదే గ్రామానికి చెందిన మోటార్ సైకిస్టు జగ్గంపేట వైపు వస్తూ ప్రసాద్‌ను ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సీసీ రోడ్డు ప్రారంభం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో పలు సీసీ రోడ్లను నిర్మించారు. వీటిని ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం ప్రారంభించారు. పలు గ్రామాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించగా, విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

కోడే కూసింది..!



తేటగుంటలో గుండాట వద్ద జనం

బందేలకు బరి తెగించారు.. పండగ ముసుగులో జూదాలకు తెరలేపారు.. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడి పందేలు, గుండాట తదితర జూద క్రీడలను నిర్వహించి తమదే పైచేయి అని నిరూపించారు.. బరులను చాలాచోట్ల కూటమి నేతలే నిర్వహించడంతో అడిగేవారు లేకపోయారు. వీటిని ఏదోలా అడ్డుకుంటామని చెప్పిన పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితం అయ్యారు. ఇలా మూడు నియోజకవర్గాల్లో రూ.కోట్లు చేతులు మారాయి. ఆ వివరాలు తెలుసుకుందాం రండి...

- ఎక్కడ చూసినా పందేలు
- చేతులు మారిన రూ.కోట్లు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు

తుని/ కిర్లంపూడి/ గోకవరం: సంప్రదాయం ముసుగులో కోడి పందేలకు అడ్డు లేకుండా పోయింది.. సంక్రాంతి పండగకు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వారంతా సొంతూళ్లకు వచ్చారు. దీనిని అవకాశంగా కూటమి పార్టీలకు చెందిన నాయకులు మలుచుకుని పందేల నిర్వహణను భుజానవేసుకుని, వారందరినీ ఇటువైపు మళ్లించారు. ఆనందంగా పండగకు వచ్చిన వారంతా నిలువు దోపిడీకి గురయ్యారు. పోలీసులు అనుమతులు ఇవ్వకపోయినా భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో పందేలు నిర్వహించారు. ఇలా నియోజకవర్గంలో రూ.100 కోట్ల మేర చేతులు మారాయి. తుని, తొండంగి, కోటనందూరు మండలాలతో పాటు తుని పట్టణంతో కలిపి 60 కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి వచ్చే ఆదాయాన్ని లెక్కలు కట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఇందులో సీ కేటగిరికి రూ.2 లక్షలు, బి.కేటగిరికి రూ.5 లక్షలు, ఏ కేటగిరికి రూ. 25 లక్షల ధర నిర్ణయించి గుండాటలు పెట్టిన వారి నుంచి నిర్వాహకులు తీసుకున్నారు. ఇది కాకుండా ఫోన్ పే, భోజనాలు, మద్యం తదితర వాటి ద్వారా వచ్చే నిర్వాహకులకు వచ్చిన ఆదాయం అదనం. కోడిపందేల కంటే గుండాటలో ప్రజలు పోగొట్టుకున్న సొమ్ము రూ.కోట్లలో ఉండటం గమనార్హం. తుని పట్టణంతో పాటు తుని మండలం తేటగుంటలో పందేల శిబిరం వద్ద రక్తం చిందేలా పలువురు కొట్టుకున్నారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినా పోలీసుల స్పందించ పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కోడి పందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన బరుల్లో పటిష్టమైన పెన్సింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో కార్లు, మోటారు సైకిళ్లు వందల సంఖ్యలో పార్కింగ్ చేశారు. కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో నగదు కోసం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఫోన్ పే ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.వెయ్యికి రూ.40 కమీషన్ తీసుకున్నారు. పందేలకు వెళ్లిన వారి దగ్గర నగదు లేకపోయినా డిజిటల్ పేమెంట్ సౌకర్యం కల్పించడం ఇదే ప్రథమం. కోసల కొనుగోలు, గుండాట ఆడటానికి వందల సంఖ్యలో డిజిటల్ సేవలు వినియోగించారు.



తుని మండలం తేటగుంటలో కోడి పందేలు

- కిర్లంపూడి మండలం కిర్లంపూడి, చిల్లంగి, వేలంక, గెద్దనాపల్లి, భూపాలపట్నం, తామరాడ, గోనేడ, వీరవరం, కృష్ణవరం, బూరుగుపూడి గ్రామాల్లో కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. మూడు రోజుల్లో రూ.కోటికి పైగా డబ్బులు చేతులు మారాయని అంచనా. వీటితో పాటు గుండాటలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. సంక్రాంతి ముసుగులో గోకవరం మండలంలో కోడి పందేలు, గుండాటలు జోరుగా జరిగాయి. మల్లవరం, రంపయర్రంపాలెం, కామరాజుపేట, గోకవరం, కృష్ణునిపాలెం, వెదురుపాక, కొత్తపల్లి, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో మూడు రోజుల పాటు కోడిపందేల బరులు నిర్వహించారు. అలాగే గుండాటలు సైతం జోరుగా జరిగాయి. మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు భారీ ఎత్తున వచ్చారు.

ప్రచారం.. ఇదో ఆర్భాటం



డిజిటల్ పేమెంట్ కోసం ఏర్పాటు చేసిన స్కానర్

కోడి పందేలు, జూదాలు ఆడితే చర్యలు తీసుకుంటామంటూ పండగ వారం రోజుల ముందు నుంచే పోలీసులు గ్రామాల్లో ఎంతో ఆర్భాటంగా ప్రచారం నిర్వహించారు. బరులు నిర్వహించే ప్రదేశాలను సందర్శించి, కోడి పందేలు ఆడితే ఎదుర్కొనే పరిణామాలపై నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత చేతులు ఎత్తేశారు. ఇలా ఈ ప్రచారం అంతా ఆర్భాటమే అని తేల్చేశారు. భోగి రోజు నుంచి కోడి తన కాళ్లకు కట్టిన కత్తితో బరిలోకి దిగి చెలరేగిపోయింది. ఇదిలా ఉంటే చిల్లంగిలో పందులు, పొట్టేళ్ల పోటీలు నిర్వహించడం గమనార్హం. గేంబ్లర్ చేతి మాయాజలంతో రూ.లక్షలను అమాయకులు పోగొట్టుకుని జేబులకు చిల్లులు పెట్టేసుకున్నారు. ఇదంతా తెలిసినా పోలీసులది ప్రేక్షక పాత్రగానే మిగిలిపోయింది.

సంక్రాంతులు.. సంతోషాలు

- ప్రతి ఇంటా బంధువులతో సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



లోవ తలుపులమ్మకు లక్ష తులసి పూజ చేస్తున్న వేద పండితులు, ప్రధాన అర్చకులు

ప్రత్తిపాడు/ ఏలేశ్వరం/ తుని రూరల్: సంక్రాంతి పల్లెలకు శోభ తెచ్చింది. కొత్త అల్లుళ్లతో ప్రతి ఇల్లూ సందడిగా మారింది. ఇంటి ముంగిట పెట్టిన రంగవల్లులు ముచ్చట గొలిపాయి. సంక్రాంతి, కనుమ వేడుకలు మంగళ, బుధవారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. డూడూ బసవన్నలు, హరిదాసులను ఆహ్వానించి పల్లె వాసులు బహుమతులు ఇచ్చారు. ఇదిలా ఉంటే చాలా గ్రామాల్లో కోడి పందేలు, జూదక్రీడలు జరిగాయి. ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ రొంగల సత్యనారాయణ, కొట్టేటి అబ్బులు, అడ్డాల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ఏలేశ్వరం సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పల్లపువీధి, మార్కెట్‌వీధి, బాలాజీచౌక్, నర్సీపట్నం రోడ్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు సందర్శించుకుని పూజలు చేశారు. పట్టణంలోని బాలాజీ చౌక్ వద్ద జనం సందడి కనిపించింది. తుని రూరల్ మండలం లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వేదపండితులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కైలాస గణపతిస్వామికి లక్షగరిక పూజ, తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చేపూరు, టి.తిమ్మాపురం గ్రామాల్లో జరిగిన ముగ్గుల పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ప్రభుత్వ విప్ యనమల దివ్య బహుమతులు అందజేశారు. రాజుపేటలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్పంచ్ బుద్దాల సత్తిబాబు, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యేశ్వరీదేవి బహుమతులు అందజేశారు.



ఏలేశ్వరంలో సత్యనారాయణ స్వామివారి ఊరేగింపు

గోకవరం: కనుమ పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. రైతులు పాడి పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే గోవులకు స్నానాలు చేయించి పసుపు, కుంకుమ, పూలు, పండ్లతో ప్రత్యేకంగా పూజలు చేశారు. నవధాన్యాలతో కూడిన ఆహారాన్ని ప్రత్యేకంగా తయారు చేసి గోమాతలకు తినిపించారు. అలాగే ఇళ్లల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోపూజ జరిగింది. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర దంపతులు గోవులకు పూజలు చేశారు.



గోకవరంలో గోవుకు పూజలు చేస్తున్న స్థానికులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

తొండంగి: మండలంలోని సంక్రాంతి, కనుమ పండగను ఘనంగా జరుపుకొన్నారు. గోపాలపట్నంలోని నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, బత్తుల దుర్గ, సీహెచ్ అరుణ, మలగంటి లోవకుమారిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తొండంగి, పైడికొండ, ఏవీ నగరం, దానవాయిపేట, ఒంటిమామిడి, బెండపూడి తదితర గ్రామాల్లో శివాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోపాలపట్నంలో ముగ్గులను తిలకిస్తున్న ప్రజలు



శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద జన జాతర

మమ్మేలు మా తల్లీ..

- పాదాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ఉన్న పాదాలమ్మ అమ్మవారి ఉత్సవాలు కనుమ రోజునే ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ యాళ్ల విశ్వేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఉదయం జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచీ పాదాలమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఏలూరు, చినశంకర్లపూడి, టి.రాయవరం, చిన్నింపేట, సిరిపురం, పెద్దనాపల్లి, వేలంక, జగపతి నగరం, కిర్లంపూడి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్తిపాడులో శ్రీపాదాలమ్మ వారు

జాతీయ రహదారిపై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంధ్ర శబరిమలైలో మకరజ్యోతి దర్శనం



పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీను

శంఖవరం: ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధిలో భక్తుల దర్శనం నిమిత్తం మకరజ్యోతి దర్శనం కల్పించారు. పలు గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు, దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారులు మంగళవారం ఆలయానికి వచ్చారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీను ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతి రోజున భక్తులకు మకరజ్యోతి దర్శనం కల్పించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, పుష్పాలంకరణ చేశారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సాయంత్రం ఆరు గంటలకు కొండల శివారున మకరజ్యోతి దర్శనం కల్పించడంతో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాల పంపిణీ జరిగింది.



పాత పోలీస్ స్టేషన్ వద్ద మురుగు కూపంలా తుని - నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: సమస్య పొంగిపొర్లింది.. రోడ్డుపైకి వచ్చింది.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మురుగు కాలువల నిర్మాణం పడకేసింది.. చేసేది లేకో, కొందరు మనకేముందిలే అనుకునో మురుగును రోడ్డుపైకే వదిలేశారు. అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోటనందూరు పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండు సెంటర్ వరకూ తుని – నర్సీపట్నం రోడ్డులో మురుగు సమస్య ఇది. ఆ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేక అక్కడి నివాసాలు, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వచ్చే కలుషిత నీటిని రోడ్లపైకి విడిచి పెడుతున్నారు. వీరు తెలివిగా అధికారులు కళ్లు కప్పి రోజంతా మలిన నీటిని నిల్వ చేసి రాత్రి వేళల్లో రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దారుణమేమంటటే సెప్టిక్ ట్యాంకుల్లో నీటిని కూడా విడిచిపెడుతున్నారు. ఈ నీరు రోజుల తరబడి రోడ్డుపై నిల్వ ఉండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. రోడ్డు అధ్వానంగా మారుతున్నా, రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నా.. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇళ్ల యజమానులు మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోటనందూరు నడిబొడ్డున ఉన్న ఈ దుస్థితిపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా రావులమ్మతల్లి జాతర



రావులమ్మ జాతర సందర్భంగా శక్తివేషాలు

జగ్గంపేట: స్థానికంగా రావులమ్మ తల్లి జాతర బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం రథంపై అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమై గ్రామంలోని వివిధ ప్రాంతాల మీదుగా ఆలయానికి చేరుకుంది. పద్మనాభనగర్ వాసులు, మహిళలు అమ్మవారికి ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. సాయంత్రం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి గరగ నృత్యాలతో జాతర ప్రారంభించారు. జాతరలో శక్తివేషాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులతో సహా ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.



నృత్యాలు చేస్తున్న యువతులు

సేవకు రెడ్ కార్పెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నాలుగు దశాబ్దాల క్రితం పదో తరగతి పూర్తి చేసి, దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా గోవాలో కలిశారు. విద్యార్థి దశలో అనుభవించిన ఇబ్బందులు కొందరు తలచుకుని, ఈనాటి సుఖసంతోషాలకు ఆనాడు పడిన కష్టమే కారణంగా భావించారు. సమాజంలోని వివిధ వర్గాల వారు ప్రస్తుతం పడుతున్న కష్టాలను మరికొందరు ప్రస్తావించారు. తమ ఉన్నతికి కారణమైన సమాజానికి ఏదో చేయాలని చర్చించుకున్నారు. చివరకు తాము చదివిన రెడ్ కాన్వెంటు నేటి తరానికి గుర్తు చేసేలా ఆనాటి మిత్ర బృందమంతా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) పేరిట విస్తృత సేవా, సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు.

నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయం వద్ద ఉన్న భవనంలో ఒకప్పుడు. చిల్డ్రన్స్ ఐడియల్ పాఠశాల పేరుతో రెడ్ కాన్వెంట్ నిర్వహించేవారు. ఈ పాఠశాలలో 1978లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా ట్రస్టు ఏర్పాటు చేయాలని బెంగళూరులో నివసిస్తున్న పారిశ్రామికవేత్త బచ్చు కమలబాబు ఆకాంక్షించారు. ఈ కాన్వెంట్లో చదివి ప్రస్తుతం పుదుచ్చేరి, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న మిత్ర బృందం ఆయనను ప్రోత్సహించారు. దీంతో గత ఏడాది 80 మంది సభ్యులుగా రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) చారిటబుల్ ట్రస్టు ఏర్పాటైంది. అందరికీ విద్య, సంపూర్ణ వైద్యం, పేదలకు ఆరోగ్యం అనే విధానంతో ముందుకు సాగుతున్నారు. దీంతో పాటు తమకు చదువు చెప్పిన గురువులు, ఆనాటి పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో రూ.1.10 కోట్లతో 562 సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

ట్రస్టు తరపున పూర్వ విద్యార్థులంతా కలిసి నగరంతో పాటు, పలు ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో బాలింతలు, అప్పుడే పుట్టిన పిల్లలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, మాతా, శిశు విభాగానికి వాటర్ హీటర్లు, ఫ్యాన్లు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన మామిడి బాలాజీ అనే నిరుపేదకు కిడ్నీ మార్పిడికి, అనంతరం మందుల కొనుగోలుకు రూ.1.50 లక్షల సాయం అందజేశారు. బాదం బాబు కృష్ణ క్లాత్, కళ్లజోళ్ల ప్రాజెక్టుకు రూ.6 లక్షలు అందజేశారు. మెడిసిన్, ఇంజినీరింగ్ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రూ.6.5 లక్షలతో 10 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. రూ.5 లక్షలతో సామర్లకోట అని కాదు — సాలిపేట బాలికల పాఠశాలకు చెందిన 1180 మంది విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్ల పంపిణీ, వీరికి ఏటా ఉచితంగా బస్సు పాసులు, గిరిజన బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఇలా సేవా కార్యక్రమాలతో అందరి మన్ననలు అందుకుంటున్నారు.



ట్రస్ట్ ద్వారా సాయం చేస్తున్న సభ్యులు

మా వంతుగా..



రెడ్ కాన్వెంట్‌లో పదో తరగతి పూర్తి చేసిన మా బృందమంతా పాఠశాల పేరు చిరస్థాయిగా నిలవాలనుకున్నాం. ట్రస్టును ఏర్పాటు చేసి మా వంతుగా సమాజ సేవకు శ్రీకారం చుట్టాం. ఈక్రమంలో పేద విద్యార్థులకు, రోగులకు, వృద్ధులు ఇలా పలు విభాగాల వారికి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మా మిత్ర బృందమంతా సేవా కార్యక్రమాల కోసం తమ సంపాదనలో కొంత భాగాన్ని ట్రస్టుకు కేటాయించడం సంతోషంగా ఉంది. పారిశ్రామిక వేత్త బచ్చు కమలబాబు ట్రస్టు వ్యవస్థాపకుడుగా ఉన్నారు.

– బాదం బాలకృష్ణ, ట్రస్టు చైర్మన్

ఏటా రూ.లక్ష సాయం



దేవుని అనుగ్రహం, దైవ సాయం ఎలా లభిస్తుందన్నది నేను ప్రత్యక్షంగా రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చూశాను. వారు నా ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, నా వైద్య, విద్యకు సాయంగా నిలిచారు. నాకు ఏటా రూ.లక్ష చొప్పున నాలుగేళ్లు ఆర్థికంగా సాయం చేశారు. నా ఇంటర్న్‌షిప్‌లో రూ.లక్ష సమకూరుస్తామన్నారు. నాలాంటి ఎంతో మంది విద్యార్థులకు సాయంగా నిలిచి, వారి బంగారు భవిష్యత్తుకు చేయూతనిస్తున్న ట్రస్ట్‌కు, అందులో భాగస్తులైన వారికి నా కృతజ్ఞతలు.

– మల్లాడి ఆకాష్, కాకినాడ